ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
బుధవారం 18 సెప్టెంబరు 2024

పెండింగ్ కేసులను పూర్తి చేయాలి

ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



నేర సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, సెప్టెంబరు 17 : పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నంద్యాలలోని జిల్లా పోలీస్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో నేరాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అసహజ మరణాలు, మిస్సింగ్ కేసుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించే పౌరుల పట్ల పోలీసులు స్నేహపూర్వకంగా మెలిగి చట్టపరంగా వ్యవహరించాలన్నారు. సమీక్షా సమావేశంలో సీఐలు జయరాములు, మోహన్‌రెడ్డి, ఎరిషావలి, విజయభాస్కర్‌తోపాటు నంద్యాలలోని నాలుగు పోలీస్‌స్టేషన్ల సీఐలు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం

● కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 17: నులి పురుగులను నివారిస్తేనే చిన్నారుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని కలెక్టర్ రాజకుమారి అన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించే నులిపురుగుల నివారణ మాత్రలు అందజేసే కార్యక్రమాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల దినంలో భాగంగా 1-19 సంవత్సరాల విద్యార్థులందరి చేత ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. నులిపురుగుల వల్ల జీర్ణాశయంలో కలిగే అనారోగ్య సమస్యలు, ఆడపిల్లల్లో వచ్చే రక్తహీనత గురించి విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, చేతుల పరిశుభ్రత పాటించాలని అన్నారు. ప్రతి గురువారం పాఠశాలలో విద్యార్థులకు ఇచ్చే ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలను తప్పనిసరిగా మింగాలని ఆమె తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహార పదార్థాలను విద్యార్థులకు అందజేయాలని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బాల స్వాస్థ జిల్లా ప్రోగ్రామ్ అధికారి కాంతారావు నాయక్ పాల్గొన్నారు.



జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ రాజకుమారి

భారీ గణేశుడికి బైబై



వాటర్‌గన్‌లతో వినాయకుడిని కరిగిస్తున్న దృశ్యం

కర్నూలు (కల్చరల్), సెప్టెంబరు 17: ఎకో ఫ్రెండ్లీ గణపతి నిమజ్జనం మంగళవారం కన్నులపండువగా సాగింది. కర్నూలు నగరంలో 63 అడుగులతో మట్టి వినాయకుడిని ఏర్పాటు చేశారు. పాతనగరంలోని పెద్ద మార్కెట్ సమీపంలో తుంగభద్ర ఒడ్డున నెలకొల్పిన ఈ గణనాథుని యువత సంబరాల మధ్య తుంగభద్రమ్మ నది ఒడిలోకి సాగనంపారు. ఫైర్ ఇంజన్ల సహాయంతో, గణనాథుని మట్టిని కరిగించి, ఆ నీరు తుంగభద్రలో కలిసేలా ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన వేడుక రాత్రి పది గంటల వరకు కొనసాగింది.

పండ్ల తోటల రైతులకు

రూ.5.30 కోట్లు చెల్లింపు

రుద్రవరం, సెప్టెంబరు 17: నంద్యాల జిల్లాలోని పండ్ల తోటలు సాగు చేసిన 3,001 మంది రైతులకు రూ.5.30 కోట్ల బకాయిలను చెల్లించినట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు తెలిపారు. మంగళవారం రుద్రవరంలో ఆయన మాట్లాడుతూ రైతుల రూ.6.87 కోట్ల బకాయిల్లో రూ.5.30 కోట్లు చెల్లించామన్నారు. జిల్లాలో ఆయిల్‌ఫాం తోటలు 2024-25కు 400 హెక్టార్లు టార్గెట్ కాగా 150 హెక్టార్లలో నాటించినట్లు తెలిపారు. ఒక హెక్టారుకు రూ.71 వేలు సబ్సిడీ రైతులకు అందుతుందన్నారు. ప్రతి సంవత్సరం రూ.5,200 నిర్వహణ ఖర్చుల కింద రైతులకు నాలుగేళ్లపాటు అందుతుందన్నారు. జిల్లాలో 73,600 హెక్టార్లలో పండ్లతోటలు ఉండగా 43,560 హెక్టార్లలో పంట నమోదైందన్నారు.

వరద బాధితులకు రూ.19.57 లక్షల సాయం

ఆత్మకూరు, సెప్టెంబరు 17: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి అన్ని వర్గాల ప్రజలు ముం దుకు వస్తున్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని పొదుపు లక్ష్మీ గ్రూపుల ద్వారా సమకూరిన రూ.19,57,950 విరాళాన్ని మంగళవారం వేల్పనూరులో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి వెలుగు పీడీ వైబీ.శ్రీధరరెడ్డి, ఏసీ పుల్లయ్య, ఏపీఎంలు, ఓటీలు, వీఓఏలు కలిసి అందజేశారు. ఇందులో ఆత్మకూరు మండలానికి సంబంధించి 3,49,855, బండిఆత్మకూరు రూ.5,20,000, మహానంది 3,45,545, శ్రీశైలం రూ.2,31,500, వెలుగోడు రూ.5,11,050 వరద సాయం సమకూరింది. అదేవిధంగా ఆత్మకూరుకు చెందిన కలీముల్లా, ముక్తార్, లం డన్ ఖాజాలు రూ.50 వేలు, శ్రీశైలానికి చెందిన దిలీప్ రూ.20వేలు, ఆత్మకూరు పట్టణానికి చెందిన రవికుమారెడ్డి రూ.25 వేలు అందజేశారు.



వరద బాధితులకు ఆర్థిక సాయం చేస్తున్న వెలుగు అధికారులు



















ఒకే కాన్పులో ముగ్గురు

శిశువుల జననం



ఆసుపత్రిలో ముగ్గురు శిశువుల

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 17: ఆళ్లగడ్డ పట్టణంలోని శివమ్మ ప్రైవేటు వైద్యశాలలో పట్టణానికి చెందిన ఆవుల స్వప్న మొదటి కాన్పులో మంగళవారం ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. జన్మించిన శిశువుల్లో ఒకరు అమ్మాయి, ఇద్దరు మగపిల్లలు క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మంగళవారం ఉదయం పురిటినొప్పులతో వైద్యశాలలో చేరిన ఆవుల స్వప్నకు వైద్యులు మాధురి, హనిషా, యశ్వంత్‌రెడ్డి సాధారణ డెలివరి చేశారు.



అవన్నీ వదంతులే



అనుమానితుడితో మాట్లాడుతున్న పోలీసులు

కోసిగి, సెప్టెంబరు 17: ఎవర్నీ ఎవరూ చంపలేదని, అవన్నీ వదంతులేనని తేలింది. ఓ యువకుడు బాలికను హత్య చేశాడన్న వార్త మంగళవారం కోసిగిలో కలకలం రేపింది. దీనికితోడు చెత్త పేపర్లు ఏరుకునే యువకుడికి రక్తపు మరకలు అంటడంతో అనుమానాలకు మరింత తావిచ్చినట్టయింది. కోసిగి సంతలో కనిపించిన ఆ యువకుడిని అక్కడున్న వారు పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకొని ఆ యువకుడిని స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ చంద్రమోహన్ విచారించగా తాను ఆసుపత్రిలో చెత్త ఏరుకునే సమయంలో కిటికీ అద్దం పగిలి చేతికి గాయమైందని చెప్పాడు. ఎస్‌ఐ చంద్రమోహన్ మాట్లాడుతూ చెత్త పేపర్లు వేరుకునే ఆ యువకుడు ఎవరినీ చంపలేదని, చెత్త ఏరుకునే క్రమంలో కిటికీ గ్లాసు పగిలి చేతికి గాయమైందని అన్నారు. పుకార్లను నమ్మవద్దని ఆయన కోరారు.

ఘనంగా విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి



విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 17: విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతిని మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విరాట్ విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ, బీసీ సంక్షేమ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విశ్వాన్ని సృష్టించిన రూపకర్త విరాట్ విశ్వకర్మ భగవాన్ అని అన్నారు. మారుతున్న కాలాన్ని అనుసరించి ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా బీసీలందరూ అభివృద్ధి చెందాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకుని వస్తే వాటిని పరిష్కరించే ప్రయత్నం చేస్తా అన్నారు. జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య మాట్లాడుతూ విరాట్ విశ్వకర్మ భగవాన్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు ధనుంజయ్, కులమాల శ్రీనివాసాచారి, విజయాచారి, కల్లూరు రాఘవాచారి, ఆదినారాయణాచారి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కవలలకు ఒకేసారి ఎంబీబీఎస్ సీట్లు

కేఎంసీలో అడ్మిషన్ పొందిన విద్యార్థినులు



కేఎంసీలో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన కవలలు దాక్షాయణి, దక్షిత

కర్నూలు (హాస్పిటల్), సెప్టెంబరు 17: కవల పిల్లలు సాధారణంగా ఒకేలా ఉంటారు. ఆటలు, పాటలు, చదువు, దినచర్యల్లో ఒకే అభిరుచులను కలిగి ఉంటారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలోని సుబ్బరావుపేటకు చెందిన సత్యనారాయణ శెట్టి, కళావతి దంపతులకు ద్రాక్షాయణి, దక్షిత అనే కవలపిల్లలు ఉన్నారు. వీరు కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీట్లను ఒకేసారి సాధించారు. సత్యనారాయణ శెట్టి కిరాణం వ్యాపారం చేస్తూ తమ పిల్లలకు కష్టపడి చదివించారు. ఈయనకు నలుగురు సంతానం ఇద్దరు కవలలు. పెద్దమ్మాయి ద్రాక్షాయని నీట్‌లో 661 మార్కులు సాధించి స్టేట్‌లో 348 ర్యాంకు వచ్చింది. చిన్నమ్మాయి దక్షిత 667 మార్కులతో స్టేట్‌లో 251 ర్యాంకు సాధించింది. మంగళవారం కర్నూలు మెడికల్ కాలేజీలో స్టేట్ కోటా కింద మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ సీట్లకు ప్రిన్సిపాల్ డా.కే. చిట్టినరసమ్మ అడ్మిషన్లు నిర్వహించారు. కవలలు ద్రాక్షాయని, దక్షితలను ఒకేసారి మెడికల్ కాలేజీలో అడ్మిషన్ పొందారు. ఇద్దరు కవలలను, వారి తల్లిదండ్రులను ప్రిన్సిపాల్ అభినందించారు. ఇద్దరు కవలలు ఒకే బ్యాచ్‌లో ఎంబీబీఎస్ సీట్లు సాధించడం అరుదని ప్రిన్సిపాల్ తెలిపారు.



కవలలను ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో చేర్పించుకుంటున్న ప్రిన్సిపాల్

కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభం

- రెండు రోజుల్లో 79 మంది చేరిక

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 17: కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డా.కే. చిట్టినరసమ్మ వెల్లడించారు. మెడికల్ కాలేజీలో 198 ఎంబీబీఎస్ సీట్లలో స్టేట్ కోటా కింద మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ సీట్లకు మొదటి రెండు రోజుల్లో 79 మంది కొత్త విద్యార్థులు అడ్మిషన్ పొందారు. మొదటి విడత అడ్మిషన్లు ఈ నెల 19న మధ్యాహ్నం 3 గం టల వరకు జరుగుతాయని ప్రిన్సిపాల్ తెలిపారు. అలాగే ఆలిండియా కోటా కింద 37 సీట్లలో 20 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు చేరినట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు.

జీఎన్‌ఎం నర్సింగ్ అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల


కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 17: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల జీఎన్‌ఎం అడ్మిషన్ నోటిఫికేషన్ 2024-25 ప్రభుత్వ స్కూల్స్‌లో జనరల్ నర్సింగ్ మిడ్ వైఫరీ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నెలల ఇంటర్న్‌షిప్ వ్యవధితో సహా 3 సంవత్సరాల కోర్సు ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపు ఈ నెల 13 నుంచి 23 వరకు ఉంటుందని, డౌన్‌లోడు చేసిన దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ ఈ నెల 25న సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ నోటిఫికేషన్ ఆన్‌లైన్ అప్లికేషన్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్‌సైట్ డీఎంఈ.ఏపీ.ఎన్‌ఐసీ.ఇన్‌లో అందుబాటులో ఉంటుందన్నారు.

పారా మెడికల్ కోర్సులకు మూడో విడత కౌన్సెలింగ్ పూర్తి

పారా మెడికల్ కోర్సులకు 2024-25 విద్యాసంవత్సరాలకు సంబంధించిన మూడో విడత కౌన్సెలింగ్ మంగళవారం పూర్తయినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కె. చిట్టి నరసమ్మ తెలిపారు. మొదటి ఫేజ్ కౌన్సెలింగ్ పూర్తయిందని కోర్సుల్లో సీట్లు పొందిన విద్యార్థులు ఏ కారణం చేతనైనా ఫీజు చెల్లించకపోతే సదరు సీట్లును వచ్చే నెలలో జరిగే రెండో ఫేజ్ కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తామన్నారు.

వంట నూనె మంట

- భారీగా పెరిగిన ధరలు
- లీటర్‌పై రూ.30 నుంచి రూ.50 వరకు బాదుడు
- కొనలేమంటున్న సామాన్యులు



ఆదోని, సెప్టెంబరు 17 : వంట నూనెలపై దిగుమతి సుంకం పెంచుతున్నట్లు కేంద్రం ప్రకటించడంతో వాటి ధరలు ఒక్కసారిగా పెంచేశారు. లీటరుపై రూ.30 వరకు పెరగడంతో ప్రజలపై భారం పడుతోంది. దీంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లో ధరలు మరింత పెరుగుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

రూ.15 నుంచి రూ.50కు పెంపు

వంట నూనెలపై దిగుమతి సుంకం పెంచుతున్నట్లు కేంద్ర ప్రకటించడంతో వాటి ధరలు ఒక్కసారిగా పెంచారు. లీటరుపై రూ.25 నుంచి రూ.50 వరకు పెరిగాయి. శనివారం ఉదయం లీటరుకు రూ.115గా ఉన్న పొద్దు తిరుగుడు నూనె ధర, సాయంత్రానికి రూ.140 నుంచి రూ.150కి పైగా అమ్మకాలు జరిగాయి. చిల్లర దుకాణాల్లో మరింత ఎక్కువే అమ్ముతున్నారు. రూ.86 పలుకుతున్న పామోలిన్ ధర లీటరు రూ.115 అయింది. మరికొన్ని రోజుల్లో పండగల సీజన్ కూడా ప్రారంభం కానున్న నేపథ్యంలో మధ్యతరగతి ప్రజల నెత్తిన భారం పడింది. ముడి పామాయిల్, సోయాబీన్, సన్‌ఫ్లవర్ నూనెలపై ఇప్పటి వరకు ఎలాంటి దిగుమతి సుంకం ఉండేది కాదు. తాజాగా వాటిపై 20 శాతం సుంకాన్ని వేయడంతోనే ఆయిల్ ధరలు భారీగా పెరిగినట్లు అమ్మకందారులు పేర్కొన్నారు.



ధరల పెంపుపై వినియోగదారుల ఆగ్రహం

వంట నూనెల ధరల పెంపుతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిల్వ ఉన్న సరుకును కూడా ఎక్కువ ధరలకు విక్రయించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. భవిష్యత్‌లో ధరలు మరింత పెరుగుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. పామోలిన్ రేట్ హోల్‌సేల్‌లో లీటరు రూ.110 అమ్ముతుండగా, చిల్లరగా రూ.115 చొప్పున విక్రయిస్తున్నారు. పొద్దుతిరుగుడు నూనె కొన్ని చిల్లర దుకాణాల్లో లీటరు రూ.140 నుంచి రూ.150 చొప్పున విక్రయిస్తుండటం గమనార్హం. పూజలకు ఉపయోగించే వివిధ రకాల నూనెల లీటరు ధర మొన్నటి వరకు రూ.109 వరకు ఉండగా అవి ఇప్పుడు రూ.120కి చేరాయి. కంపెనీల నుంచి మూడు రోజులుగా లోడింగ్ కూడా నిలిచిపోయిందని వ్యాపారులు అంటున్నారు. వంట నూనెల ధరలు శనివారం ఉదయం వరకు, ఎమ్మార్పీ కంటే తక్కువగా ఉన్నాయి. దిగుమతి సుంకం పెంపుదలపై ప్రకటన రావడంతో ఎక్కడికక్కడ ధరలు పెంచారు. ఎమ్మార్పీ ఎంత ఉంటే అంతే ధర నిర్ణయించారు. ఆన్‌లైన్ సంస్థల్లోనూ కొద్దిసేపు వంట నూనెల అమ్మకాలను నిలిపివేసి పెంచిన ధరలతో సవరించాయి.



సీతారం ఏచూరి సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

ఏచూరి స్ఫూర్తితో ముందుకెళ్లాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్

కర్నూలు (కల్చరల్), సెప్టెంబరు 17: దివంగత సీపీఎం జాతీయ నేత సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ అన్నారు. మంగళవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభను సీపీఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయ్ అధ్యక్షతన నిర్వహించారు. గఫూర్ మాట్లాడుతూ ప్రపంచ కమ్యూనిస్టు పార్టీలతో మంచి అనుబంధం ఉన్న నాయకుడు ఏచూరి అని శ్లాఘించారు. ఏచూరి గొప్ప మేధావి అని, గొప్ప పార్లమెంటేరియన్ అని, ప్రధానులు ఎవరు ఉన్నా ఆయన ప్రసంగాన్ని శ్రద్ధగా వినేవారని గుర్తు చేశారు. డి. గౌస్ దేశాయ్ మాట్లాడుతూ ఏచూరీకి జిల్లాతో మంచి అనుబంధం ఉందని అన్నారు. ఎన్‌ఆర్‌సీ, సీఏఏ సభల్లో పాల్గొని మైనారిటీలకు భరోసా ఇచ్చారని తెలిపారు.

దేశం గర్వించదగ్గ నాయకుడు ఏచూరి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి

ఏచూరి దేశం గర్వించదగ్గ నాయకుడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి కొనియాడారు. రాజ్యసభ సభ్యునిగా ఆయన నిరాడంబర జీవితం గడిపారని, సొంతంగా కారు నడుపుతూ పార్లమెంటుకు వచ్చే వారని గుర్తు చేసుకున్నారు. అలాంటి మహనీయులు పని చేసిన ఎస్ఎఫ్ఐలో వారి అడుగుజాడల్లో పనిచేయడం వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని చెప్పారు. నిజాయితీగా ఉండటం ఆయన నేర్పించారని అన్నారు. అందుకే ఏచూరిది మచ్చలేని జీవితం అని కొనియాడారు. ఇందిరాగాంధీని రాజీనామా చేయించిన మగధీరుడు ఏచూరి అని మాజీ మంత్రి మూలింటి మారెప్ప అన్నారు. తాను చదువుకునే రోజుల్లో కమ్యూనిస్టు సభలకు వెళ్లేవాడినని గుర్తు చేసుకున్నారు. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి సవరణలు చేయించిన నాయకుడు ఏచూరి అని అన్నారు. ఏచూరికి భారత రత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో ప్రతివాదుల్లో దిట్టగా సీతారాం ఏచూరి నిలిచారని రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య అన్నారు. భారతీయులంతా సమానమేనని చాటిచెప్పిన నాయకుడు ఏచూరి అని ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఈ సభలో సీపీఐ నాయకుడు జగన్నాథం, జనసేన రాష్ట్ర నాయకుడు పీటీవీ సుబ్బయ్య, ఎస్‌యూసీఐ నాయకుడు నాగన్న, జనసేన కర్నూలు ఇన్‌చార్జి అర్షద్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కే ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి. నిర్మల, నగర కార్యదర్శులు రాముడు, బీసీ సాధికార కమిటీ ఛైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, వైద్యుడు ఓబుల్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు.

నవోదయలో కళా ఉత్సవాలు ప్రారంభం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు17: ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి నవోదయ విద్యాలయంలో మంగళవారం కళా ఉత్సవాలను ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను విద్యాలయ ప్రిన్సిపాల్ పద్మావతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ ఉత్సవాలు 18వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులను ప్రాంతీయ స్థాయి ఎంపికకు కేరళలోని కోజికోడ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దాసవాణి సాహిత్యం



సంగీత కచేరి నిర్వహిస్తున్న శేషగిరి దాసరు

మంత్రాలయం, సెప్టెంబరు 17: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో దాసవాణి సాహిత్యం భక్తులను ఆకట్టుకుంది. మంగళవారం అనంత చతుర్దశిని పురస్కరించుకుని రాయచూరు చెందిన శేషగిరిదాసరు గోపాల్ గుడిబండి, శ్రీపాదదాస, వాసుదేవ కస్బే సంగీత కచేరీ నిర్వహించారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

ముగిసిన పీఠాధిపతుల చాతుర్మాస దీక్షలు



పీఠాధిపతులను సన్మానిస్తున్న సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, సెప్టెంబరు 17: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, కర్ణాటకలోని వాదిరాజమఠం పీఠాధిపతి అక్షోభ రామప్రియ తీర్థులు, వ్యాస రాజమఠం స్వామీజి విద్యా మనోహర తీర్థులు చాతుర్మాస దీక్షలను ముగించారు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి ఊంజల మండపం వద్ద మంత్రాలయం పీఠాధిపతి నగదు, వెండి చెంబు, తట్ట, పట్టువస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షింతలు ఇచ్చి సత్కరించారు. ఇతర మఠాలకు చెందిన ఇద్దరు పీఠాధిపతులు మంత్రాలయం పీఠాధిపతిని సన్మానించారు. పండిత కేసరి విద్వాన్ రాజాఎస్ గిరిరాజాచార్, రాజాఎస్ అప్రమేయాచార్, ఏఏవో మాధవశెట్టి పాల్గొన్నారు.

వైభవంగా అనంత పద్మనాభ వ్రతం

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో అనంత పద్మనాభ స్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పూర్ణబోధ పూజా మందిరంలో అనంత చతుర్దశిని పురస్కరించుకుని మూలరాముల సంస్థాన పూజను నిర్వహించారు. ఉదయం నుంచి రాఘవేంద్రస్వామి బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండిత కేసరి, విద్వాన్ రాజాఎస్ గిరిరాజాచార్, గౌహతి రిటైర్డ్ చీఫ్ జడ్జి జస్టిస్ శ్రీధర్‌రావు, ఏఏవో మాధవశెట్టి పాల్గొన్నారు.

మాజీ మంత్రి బుగ్గనపై చర్యలు తీసుకోవాలి

- ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 17: సీఎఫ్ఎంఎస్ ద్వారా ఉద్యోగులకు వేతనాలు ఇవ్వకుండా అడ్డుకున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేష్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చొరవ తీసుకొని ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు. గత సంప్రదాయం ప్రకారం 5 సంవత్సరాలు పూర్తయిన వారికి మినిమమ్ స్కేల్ ఇవ్వాలని, గత ప్రభుత్వంలో తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని, నాలుగు సంవత్సరాలుగా ఔట్ సోర్సింగ్ కింద పని చేస్తున్న వారికి వెంటనే వేతనాలు ఇవ్వాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య

కర్నూలు, సెప్టెంబరు 17: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్త బస్టాండు సమీపంలో ఆర్‌కే లాడ్జిలో పృథ్వీరాజ్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక కొత్తపేటకు చెందిన పృథ్వీరాజ్ డిగ్రీ చదువును మధ్యలోనే ఆపేసి వ్యాపారం చేయాలని తిరుగుతున్నాడు. తండ్రి ఇటీవల ఏదైనా ఉద్యోగం చేసుకోవాలని సూచించాడు. ఈ క్రమంలోనే మంగళవారం ఆర్‌కే లాడ్జిలో ఉరి వేసుకుని కనిపించాడు. తండ్రి వెంకటస్వామి సంఘటనా స్థలానికి వెళ్లి లాడ్జి తలుపులు పగులకొట్టి పృథ్వీరాజ్‌ను ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వ్యాపారం కోసం ఇంట్లో ఎవరికీ తెలియకుండా రూ.10 లక్షలు అప్పు చేసినట్లు తెలిసింది. వ్యాపారం నష్టం రావడంతో అవమానంగా భావించిన పృథ్వీరాజ్ ఈ ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పాములపాడు, సెప్టెంబరు 17: మూడు రోజుల క్రితం ఇంటి నుండి వెళ్లిన గుండు సిద్ధయ్య (32) మంగళవారం వాగులో శవమై తేలిన సంఘటన మండలంలో చోటు చేసుకొంది. ప్రమాదవశాత్తు కాలువలో పడి మరణించాడా.. లేక ఎవరైనా హత్య చేసి కాలువలో పడేశారా అనే చర్చ గ్రామస్థుల్లో జరుగుతోంది. మండలంలోని ఎర్రగూడూరు గ్రామానికి చెందిన గుండు సిద్ధయ్య ఈ నెల 14న ఇంటి నుండి వెళ్లాడని, 16వ తేదీ పాములపాడు పోలీస్ స్టేషన్‌లో కనబడటం లేదని ఫిర్యాదు చేశారని అన్నారు. వాణాల గ్రామ సమీపంలోని కొర్రపోలు వాగు వద్ద మృతదేహం లభ్యమైందని తెలిపారు. పంచనామా నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని, మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని అన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తమ్ముడిపై గొడ్డలితో అన్న దాడి

- తీవ్ర గాయాలు
- ఆరుగురిపై కేసు నమోదు

గడివేముల, సెప్టెంబరు 17: తమ్ముడిపై అన్న గొడ్డలితో దాడి చేసిన ఘటన మండలంలోని ఎల్‌కే తండాలో చోటు చేసుకుంది. మంత్రునాయక్ అతడి సోదరుడు బాలస్వామినాయక్‌లకు ఇంటి ముందు ఉన్న ప్రభుత్వ బోరుకు పైపులైన్ వేసుకునే విషయంలో ఘర్షణ జరిగింది. దీంతో మంత్రునాయక్ బాలస్వామి నాయక్‌పై గొడ్డలితో దాడి చేసి గాయపరిచాడు. దాడిని అడ్డుకోబోయిన బాలస్వామినాయక్, తల్లి నాగినిబాయి, తండ్రి నాగేనాయక్‌లను మంత్రునాయక్ భార్య లక్ష్మీబాయి, మామ కమలనాయక్, బావమరుదులు రామకృష్ణనాయక్, కృష్ణనాయక్, శ్రావణిబాయి రాళ్లతో, కట్టెలతో దాడి చేసి గాయపరిచారు. దీంతో నాగేనాయక్, నాగినిబాయి గాయాలపాలయ్యారు. బాధితుడు బాలస్వామినాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆయిల్ దుకాణాలపై విజిలెన్స్ తనిఖీలు

- పది కేసులు నమోదు

కర్నూలు, సెప్టెంబరు 17: నగరంలోని కల్లూరు ఎస్టేట్‌లో ఉన్న పలు ఆయిల్స్ దుకాణాలపై విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి ఆదేశాల మేరకు సీఐ సునీల్ కుమార్, డీసీడీవో రమణ తదితరులు కలిసి ఈ తనిఖీలు చేపట్టారు. ఆయిల్ పరిణామాల్లో తేడాలు ఉండటం, ధరల పట్టికలు కనపరచకపోవడంపై పది కేసులు నమోదు చేశారు. అలాగే డోన్‌లో సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో తహసీల్దార్ వెంకటనారాయణ ఈ తనిఖీలు చేశారు. అక్కడ కూడా మూడు కేసులు నమోదు చేశారు.

భ్రమరాంబాదేవికి లక్ష కుంకుమార్చన

శ్రీశైలం, సెప్టెంబరు 17: శ్రీశైల మహాక్షేత్రంలో మంగళవారం పౌర్ణమిని ఘడియలను పురస్కరించుకుని సాయంత్రం భ్రమరాంబాదేవి అమ్మవారికి లక్ష కుంకుమార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా అర్చకులు పూజా సంకల్పం పఠించి అనంతరం మహాగణపతికి పూజలు చేశారు. తరువాత శాస్త్రోక్తంగా లక్షకుంకుమార్చనను జరిపించారు. అదేవిధంగా ఆలయంలో శ్రీగిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని దేవస్థానం ఘనంగా నిర్వహించింది. సాయంత్రం స్వామి, అమ్మవార్ల మహామంగళహారతుల అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీలో ఊరేగింపుగా గిరిప్రదక్షణ చేశారు.

వైభవంగా ఊయలసేవ, పల్లకీ ఉత్సవం : శ్రీశైల క్షేత్రంలో లోకకల్యాణార్థం పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ, పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకీలో ఆశీనులనుజేసి ఆలమ్మవారి ఆలయ ప్రాంగణంలో వైభవంగా ఉత్సవాన్ని నిర్వహించారు.



లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకులు



గిరిప్రదక్షిణలో పాల్గొన్న అధికారులు, భక్తులు

స్వచ్ఛతా హి సేవా ప్రారంభం

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 17: నంద్యాల గాంధీచౌక్ వద్ద మంగళవారం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఈనెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ప్రజలందరూ భాగ స్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజలు, విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించి పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో అందరూ భాగస్వాముల కావాలని కోరారు.

నంద్యాల రూరల్: కొత్తపల్లి, బీమవరం గ్రామాలలో జరిగిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. బీమవరంలోని నులిపురుగుల దినోత్సవాన్ని పురష్కరించుకుని ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఎంపీడీవో సుగుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: జాతిపిత మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని నిర్మించేందుకు కృషి చేద్దామని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మంగళవార పట్టణంలో మున్సిపల్ కమిషనర్ బేబి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అందరం కలిసికట్టుగా కృషి చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ జాకీర్, ముర్తుజావళి, నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: గ్రామ పంచాయతీలు బలోపేతం కావాలంటే పారిశుధ్య పనులు మెరుగు పడాలని మండల ప్రత్యేక అధికారి సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ చింతామణి, ఎంపీడీవో మేరీలు అన్నారు. మంగళవారం కొత్తపల్లి బస్టాండు సెంటరులో గాంధీ విగ్రహం ముందు సర్పంచ్ లక్ష్మీదేవి అధ్యక్షతన ఎంపీడీవో మేరీ ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛతాహీ సేవ-2024 కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ చింతామణి పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పగిడ్యాల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. పగిడ్యాల జడ్పీ హైస్కూల్‌లో ఇన్‌చార్జి ఎంపీడీవో నాగరాజు, ముచ్చుమర్రి గ్రామంలో ఏపీఎం శ్రీనివాసులు,



నంద్యాలలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్

నెహ్రూనగర్ గ్రామ సర్పంచ్ రాజేశ్వరి ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనతరం అధికారులు, ప్రజాప్రతినిధులు పాఠశాల పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై విద్యార్థులు, గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈవోఆర్డీ నాగేంద్రమయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. కేంద్రప్రభుత్వం స్వచ్ఛతహీ కార్యక్రమం నిర్వహించాలనే పిలుపు మేరకు మంగళవారం గ్రామాల్లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మానవహారం నిర్వహించారు. సర్పంచ్ బాలమద్దిలేటి, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ ప్రజలకు అవగాహన కల్పించారు.

మిడుతూరు: మండంలోని గ్రామాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. మిడుతూరులో సర్పంచ్ జయలక్ష్మమ్మ ఆధ్వర్యంలో కెజీబీవీ, మాడల్ స్కూల్ విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, టీడీపీ నాయకులు శివరామిరెడ్డి, సర్వోత్తమ రెడ్డి హాజరయ్యారు. అనంతరం గ్రామస్థులకు డస్టుబిన్‌లు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి సుదీర్ నందకుమార్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దుకునేందుకు ప్రజలందరు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్,



నందికొట్కూరులో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రషీద్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం స్వచ్ఛతా హి సేవా -2024 కార్యక్రమాన్ని పురస్కరించుకుని పట్టణంలో మున్సిపల్ కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎన్విరాన్‌మెంట్ ఏఈ ఓబులేసు, మేనేజర్ చాంద్‌బాషా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జీవన్ తదితరులు ఉన్నారు.

బండిఆత్మకూరు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా స్వచ్ఛత పాటించాలని వివిధ శాఖల మండలస్థాయి అధికారులు సూచించారు. మంగళవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో భాగంగా కడమలకాల్వ, లింగాపురం, ఎర్రగుంట్ల, ఎ.కోడూరు గ్రామాల్లో విద్యార్థులతో ర్యాలీలు చేయించారు. కొన్ని చోట్ల పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేయించారు. సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహానంది: తిమ్మాపురం, గాజులపల్లి, గోపవరం, బుక్కాపురం, మహానంది గ్రామాల్లో స్వచ్ఛతా హి సేవాలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రధాన సెంటర్లల్లో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ సుదర్శనం, పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్, టీడీపీ నాయకులు మహేశ్వరరెడ్డి, సూరే శ్రీనివాసులు, మారెడ్డి సుబ్రమణ్యం, మారెడ్డి జయరాం పాల్గొన్నారు.

పాణ్యం: మండలంలో మంగళవారం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పాణ్యంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి ఆధ్వర్యలో మానవహారాలు ఏర్పాటు చేసి స్వచ్ఛత, పరిశుభ్రత గురించి తెలిపారు. సర్పంచ్ పల్లవి, ఉపసర్పంచ్ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ ఉశేన్‌బీ, ఎంపీటీసీ రంగరమేష్, ఈవోఆర్డీ సులోచన, ఎంఈవో సుబ్రహ్మణ్యం, ఏపీఎం ప్రసాద్, ఈవో ఆనందరావు, ఏపీవో విజయరాణి పాల్గొన్నారు.

గడివేముల: గడివేములలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని ఎంపీడీవో శ్రీనివాసులు ప్రారంభించారు. గడివేముల హైస్కూల్ విద్యార్థులతో కలిసి భారతదేశ చిత్రపట ఆకారంలో మానవహారంగా ఏర్పడ్డారు. విద్యార్థులతో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. హెచ్‌ఎం విక్టర్ ఇమ్మానుయేలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఇకపై ఫ్రెండ్లీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

● రాచరిక వ్యవస్థ పోడియాల తొలగింపు



ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తొలగిన పోడియం

ఆత్మకూరు, సెప్టెంబరు 17: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అంటేనే న్యాయస్థానాల తరహాలో ఫ్లోరింగ్ కంటే ఎత్తులో చాంబర్లతో ఓ ప్రత్యేకతను కలిగి ఉంటాయి. రిజిస్ట్రేషన్ల నిమిత్తం కార్యాలయానికి వచ్చే జనం సబ్ రిజిస్ట్రార్ ముందు నిలబడి ఆమోదం పొందిన తర్వాతే రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగాల్సి ఉంటుంది. ఈ పద్ధతులు బ్రిటీష్ కాలం నుంచి కొనసాగుతూనే ఉన్నాయి. ఎందుకంటే బ్రిటీష్ పాలనలో అధికారులు దర్పాన్ని ప్రదర్శించేలా ఈ పద్ధతులను అమలు చేసేవారు. అయితే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా పన్నులు కడుతున్న ప్రజల పట్ల ఈ విధానం అమర్యాదపూర్వకంగా ఉందని గుర్తించిన ఆ శాఖ ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ.సిసోడియా ఈ నెల 14వ తేదీన రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని ఇకపై స్నేహపూర్వక రిజిస్ట్రేషన్లు జరగాలని నిర్ణయించారు. కార్యాలయానికి వచ్చే ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా మెలిగేందుకు అడ్డుగా ఉన్న పోడియంలను, రెడ్ కార్పెట్లను తక్షణమే తొలగించాలని ఆదేశాల జారీ చేశారు. అలాగే సబ్‌రిజి స్ట్రార్‌కు ప్రజలకు మధ్య బేబుల్ తప్ప మరేమి అడ్డంగా ఉండకూదని ఉత్తర్వుల్లో ఇచ్చారు. అంతేకాదు సబ్ రిజిస్ట్రార్ కూర్చునే కుర్చీ కంటే ఫ్లోరింగ్ కట్టే ఎత్తులో కాకుండా సాధారణ ఫ్లోరింగ్‌పైనే ఉండాలని సూచించారు. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్న 23 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పోడియంలు, రెడ్‌కార్పెట్ల తొలగింపు చర్యలు చేపట్టారు. శనివారం నుంచి మూడు రోజుల పాటు వరుస సెలవులు రావడంతో పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ పనులను చకచకా పూర్తి చేశారు.

మందుబాబుకు జైలు శిక్ష

నంద్యాల క్రైం, సెప్టెంబరు 17: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన మందుబాబుకు పదిరోజులు జైలు శిక్ష జడ్జి విధించినట్లు ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా మంగళవారం తెలిపారు. దేవనగర్‌కు చెందిన అస్లాం అనే వ్యక్తి మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా సంజీవనగర్ సమీపంలో ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో అస్లాం పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ రాంభూపాల్ రెడ్డి ఎదుట హాజరుపరచగా పదిరోజులు జైలు శిక్ష విధించినట్లు చెప్పారు.

పంటల పరిశీలన

మిడుతూరు, సెప్టెంబరు 17: పీరుసాహేబ్ పేట, మిడుతూరు గ్రామాల్లో అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, సీనియర్ శాస్త్రవేత్తలు వెంకటరమణమ్మ, జయలక్ష్మి, పులిబాయి మంగళవారం పరిశీలించారు. ఏడీఏ విజయ శేఖర్, వ్యవసాయాధికారి పీరునాయక్, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, నాయకుడు సర్వోత్తమ రెడ్డి, వీఏఏ అశోక్, చంద్రకళ రైతులు పాల్గొన్నారు.

పాములపాడు: ఇటీవల తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలను శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటరమణమ్మ జయలక్ష్మి, పుల్లిబాయ్ మంగళవారం పరిశీలించారు. సిబ్బంది గాయత్రి, మద్దిలేటి, మునిషేర్ రైతులు పాల్గొన్నారు.

'విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి'

పాములపాడు, సెప్టెంబరు 17: గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని, కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించిన గణేశ్ పవన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈవో బాలాజీ నాయక్ సూచించారు. మంగళవారం పాములపాడులోని శ్రీ వివేకానంద విద్యా విహార్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో చదివిన గణేశ్ మదు పవన్‌కు అభినందన సభ నిర్వహించారు.

పీఎం ఆవాస్ యోజన గృహాల ప్రారంభం

మిడుతూరు, సెప్టెంబరు 17: కడుమూరు గ్రామంలో పీఎం ఆవాస్ యోజన నూతనంగా నిర్మించిన గృహాలను నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మంగళవారం ప్రారంభించారు. హౌసింగ్ డీఈ విజయబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో పాల్గొని గ్రామస్థులకు చెత్త సేకరణ డస్టుబిన్‌లు, పారిశుధ్య కార్మికులకు కిట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ జీవరత్నం, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష రెడ్డి, టీడీపీ నాయకులు శివరామి రెడ్డి, సర్వోత్తమ రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఇద్రూస్, బుస గౌడు, గోవర్ధన్‌రెడ్డి, రామస్వామి రెడ్డి, నరసింహగౌడు అధికారులు పాల్గొన్నారు.

వెలుగోడు: వెలుగోడులో ప్రధాన మంత్రి ఘర్ ఇంటిని ఎంపీడీవో అమానుల్ల ప్రారంభించారు. మంగళవారం ప్రధా మంత్రి జన్మదినం సందర్భంగా పట్టణంలోని పీఎం ఘర్ కింద మంజూరు అయిన ఇంటిని ప్రారంభిం చారు. టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ ఖలీల్‌ఖాన్, హిదాయత్, అలీఖాన్, డాక్టర్ జాకీర్, మజీద్‌ఖాన్, రమణ, సయ్యద్ పాల్గొన్నారు.

వసతి గృహం తనిఖీ

పాములపాడు, సెప్టెంబరు 17: పాములపాడులోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం, ఆహార పదార్థాల స్టాక్ నిల్వలను, నాణ్యతను పరిశీలించారు. మినరల్ వాటర్ ప్లాంట్ పనిచేయక పోవడంపై ఆరా తీశారు. నేషనల్ హైవే విస్తరణ పనులలో వసతి గృహంలో కొంతమేర పోతుందని వాటికి సంబంధిం చిన పరిహారం అందలేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వసతి గృహాన్ని పరిశీ లించి వసతులపై ఆరా తీశారు.

నాయకుడి మృతికి నివాళి: టీడీపీ నాయకుడు ఉన్నం కృష్ణారెడ్డి గుండె పోటుతో మృతి చెందడంతో ఎమ్మెల్యే జయసూర్య ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, రవీంద్రరెడ్డి, హరినాథరెడ్డి, మధుకృష్ణ, చంద్రశేఖర్, గోవిందు, లింగస్వామి, పూసల కృష్ణ, రాము, సురేశ్, కలీముల్లా, స్వాములు జనార్దన్, అర్జున్ గౌడ్, రాములమ్మ పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ప్రభుత్వం: మంత్రులు



ఎమ్మెల్యే జయసూర్యకు చెక్కును అందజేస్తున్న ఆర్ఎంపీలు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 17: బుడమేరు వరద బీభత్సంతో తీవ్రంగా నష్టపోయిన వరదముంపు బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని రాష్ట్ర మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డిలు అన్నారు. నంద్యాలకు చెందిన గురు రాఘవేంద్ర విద్యాసంస్థల యాజమాన్యం వరద బాధితులకు ఒక్కొక్క కుటుంబానికి పదికేజీల బియ్యం వెయ్యి కుటుంబాలకు సరఫరా చేసిన బియ్యం ప్యాకెట్లను విజయవాడలో బాధితులకు నేరుగా పంపిణీ చేశామని మంత్రులు చెప్పారు. అలాగే సీఎం సహాయ నిధికి గురు రాఘవేంద్ర విద్యాసంస్థల ఛైర్మన్ డా.దస్తగిరిరెడ్డి రూ.2.50నగదు చెక్కును అందజేశామన్నారు. దాతల సహకారం మరువలేనిదని వారు కొనియాడారు. విద్యాసంస్థల డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 17: రాష్ట్రంలో వరద బాధితులను ఆదుకోవడానికి సీఎం సహాయ నిధికి నియోజకవర్గ ఆర్ఎంపీలు అందరూ కలిసి తమవంతు సాయంగా నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్యకు రూ.65,800 చెక్కును అందజేశారు. మంగళవారం అల్లూరు గ్రామంలో ఎమ్మెల్యే జయసూర్యకు టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి స్వగృహంలో అందించారు. ఆర్ఎంపీలు ఎమ్మెల్యే జయసూర్యను పూలమాలలతో సన్మానించారు.

గడివేముల: విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండలంలోని కరిమద్దెల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఎమ్మెల్యే గౌరుచరితకు రూ.90,600 నగదును అందజేశారు. ఈ సందర్భంగా మండలపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు కరిమద్దెల గ్రామంలో విరాళాలు సేకరించామని చెప్పారు.



వరద బాధితులకు బియ్యం పంపిణీ చేస్తున్న మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి



ఎమ్మెల్యే గౌరు చరితకు విరాళం అందజేస్తున్న టీడీపీ కరిమద్దెల నాయకులు

శివారెడ్డి, భూపాల్‌రెడ్డి, అంక్కిరెడ్డి, ఉసేన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నంద్యాల రూరల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం నంద్యాల ఉప్పర సంఘం నాయకులు రూ.49.999నగదును విరాళంగా ప్రకటించారు. మంగళవారం నగదును ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు బ్యాంక్ ద్వారా జమచేసినట్లు ఆ సంఘం జిల్లా కన్వీనర్ ఉప్పర సురేష్ తెలిపారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్‌కు ఓచర్‌ను అందజేశారు.

సుగాలిమెట్టలో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పాణ్యం, సెప్టెంబరు 17: మండలంలోని సుగాలిమెట్టలో మంగళవారం అత్యవసర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈనెల 17వ తేదీన ఆంధ్రజ్యోతిలో 'జ్వరాల బారిన సుగాలిమెట్ట' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన మద్దూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది హుటాహుటిన సుగాలిమెట్టలో డాక్టర్ సునీత ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి జ్వరాల బారిన పడ్డ గిరిజనులకు వైద్యం అందించారు. వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి రోగులకు తక్షణ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ పరిశీలించారు. డాక్టర్ అభిషేక్ ఎంపీహెచ్‌ఈవో సుబ్బారెడ్డి, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ మహాశాంతి హోమంలో పాల్గొన్న భక్తులు

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 17: నంద్యాల ఆర్టీసీ బస్టాండు సమీపంలో వెలసిన వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం విరాట్ విశ్వకర్మ భగవానుడి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచన, కంకణధారణ, అఖండ జ్యోతి ప్రజ్వలన, బ్రహ్మమహా కలశస్థాపన, గాయత్రి విశ్వకర్మ ఆవాహన బ్రహ్మ కలశ పూజా, పంచామృత అభిషేకం, విశ్వకర్మ మహాశాంతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు సూర్యప్రకాశ్ ఆచారి, గౌరవ అధ్యక్షుడు గురుప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీకాళికాదేవి ఆలయంలో మంగళవారం విశ్వకర్మ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ జయంతి కమిటీ కన్వీనర్ సహదేవాచారి, సభ్యులు రాఘవాచారి, మౌళీచారి, నరసింహాచారి భగవాన్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అలాగే కలశాలు ఉంచి పూజలు నిర్వహించారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



నెహ్రూనగర్‌లో చిన్నారులకు మాత్రలు వేస్తున్న సిబ్బంది

ఆత్మకూరు, సెప్టెంబరు 17: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. నులిపురుగుల నివారణ కోసం విద్యార్థులు తగిన జాగ్రత్తలు పాటించాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ సాజిదా ఫిర్దోస్ అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజు, మెప్మా ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఆత్మకూరు రూరల్: నులి పురుగులను పూర్తిగా నిర్మూలించి, రక్త హీనతను తగ్గించేందుకే ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్‌అన్నారు. మంగళవారం బైర్లూటి, కొట్టాల చెరువు పీహెచ్‌సీల పరిధిలోని అన్ని ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అమలాపురంలోని ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రజిత, హెల్త్ అసిస్టెంట్‌లు విశ్వనాథ్, భాస్కర్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నందికొట్కూరు: పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో హెడ్ మాస్టర్, రాజేశ్వరి, నారాయణ, సమీనా, టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు మీనాక్షి, హెల్త్ సెక్రటరీ జయలక్ష్మి, వైద్యులు పాల్గొన్నారు.

పగిడ్యాల: నులిపురుగుల నివారించి రక్తహీనత నుంచి విద్యార్థులను కాపాడడానికి ఆల్బెండజోల్ మాత్రలను ప్రభుత్వం అందజేస్తు న్నట్లు పగిడ్యాల పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్ తెలిపారు. వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలోని విద్యార్థులకు మంగళవారం మాత్రలను అందజేసినట్లు తెలిపారు. నెహ్రూనగర్ గ్రామంలోని 2వ అంగన్‌వాడీ కేంద్రంలో సర్పచ్ రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి వీరన్న చిన్నారులకు మాత్రలు అందజేశారు.

పంట నమోదు గడువు పొడిగింపు

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 17: పంటనమోదు కార్యక్రమాన్ని ప్రభుత్వం గడువును ఈనెల 15 నుంచి 23 వరకు పెంచిందని వ్యవసాయాదికారి కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతుసేవ కేంద్రాలను సందర్శించి రైతులకు అవగాహన కల్పించారు. తప్పనిసరిగా ఈనెల 23లోపు ఈపంటనమోదును రైతుభరోసా కేంద్రాల్లో చేయించుకోవాలని అన్నారు. అంతేకాకుండా వందశాతం ఈకేవైసీ చేయించాలని వ్యవసాయ సహాయకులకు ఆదేశించారు.

'త్వరగా పూర్తి చేయాలి'

నంద్యాల రూరల్: ఈకేవైసీ, పంట నమోదును త్వరగా పూర్తి చేయాలని నంద్యాల మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం బీమవరం, ఊడుమాల్పురం గ్రామాలలో పంట నమోదు, ఈకేవైసీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వందశాతం పంటనమోదు చేయాలని వ్యవసాయ సహాయకులకు పిలుపునిచ్చారు. పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలు అందుతాయన్నారు. ఈనెల 23వ తేదీలోపు పంట నమోదు, ఈకేవైసీ పక్రియను సిబ్బంది పూర్తి చేయాలన్నారు.

లక్ష్యాలను చేరుకోవాలి: కలెక్టర్

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 17: వందరోజుల ప్రణాళికలో భాగంగా శాఖలవారీగా నిర్దేశించిన లక్ష్యాలను అక్టోబరు 2వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వందరోజుల ప్రణాళికలో భాగంగా వ్యవసాయ శాఖకు సంబంధించి సేంద్రియ వ్యవసాయం, సీసీ కార్డు, ఈ పంట నమోదు పూర్తయిందన్నారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహార నివేదికలను ప్రభుత్వానికి పంపామన్నారు. పండ్ల తోటలు, ఆయిల్ పామ్ ప్లాంటును ప్రోత్సహించాలన్నారు. మినీగోకులం షెడ్లు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, 4 రిజార్వాయర్లలో చేపల పెంపక ఉత్పత్తికి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. పీఎం విశ్వకర్మయోజన కింద 4820 దరఖాస్తులను ఆమోద నిమిత్తం ప్రభుత్వానికి నివేదించామన్నారు. టిడ్కో ప్రాంగణంలో మహిళా మార్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామని , 150 ఇళ్లకు అన్ని మౌళిక వసతులు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. ఓడీఎఫ్ ప్లస్ సర్వే 98.13 శాతం పూర్తయిందన్నారు. సమావేశంలో సీపీవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం'

నిరుపేదల సొంతింటి కలలు నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ రాజకుమారి అన్నారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ హాలులో భువనేశ్వర్ నుంచి పీఎంఏవై గ్రామీణ్, అర్బన్‌కు సంబంధించి పీఎం ఆవాస్ యోజన 2.0 విధివిధానాలను ప్రారంభించిన ప్రధాని మోదీ వర్చువల్ సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలో ఇప్పటివరకు గృహాలు మంజూరైన వారందరూ త్వరగా ఇళ్లను పూర్తిచేసుకునేలా చూడాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఇంటి పత్రాలు పంపిణీ చేశారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న బీజేపీ కార్యకర్త

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 17: భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన సందర్భంగా మంగళవారం పార్టీ జిల్లా ఇన్‌చార్జి రమేష్‌నాయుడు, జిల్లా కోఆర్డినేటర్ అభిరుచి మధు ఆధ్వర్యంలో బీజేపీ పట్టణ కమిటి నిర్వహణలో విజయ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లింగారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు డా. ఇంటి ఆదినారాయణ, పట్టణ అధ్యక్షుడు కశెట్టి చంద్రశేఖర్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు స్వాతి తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో కేశవరెడ్డి విద్యాసంస్థల అధ్యాపకులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు బాబా ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని గౌడ్‌సెంటర్ నందు మంగళవారం భగవాన్ విశ్వకర్మ జయంతి, ప్రధానీ నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను కూటమి పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం బీజేపీ నాయకులు మల్లెల కృష్ణారెడ్డి, గరుడాద్రి సత్యనారాయణశర్మ, గరుడాద్రి సుదర్శన్, సాంబశివగౌడ్, విశ్వరూపాచారీ, మౌళిబాషా, శ్రీధర్‌గుప్తా, టీడీపీ నాయకులు శివప్రసాద్, వేణుగోపాల్, రామమూర్తి, జనసేన పార్టీ నాయకులు శ్రీరాములు, కూటమి పార్టీల నాయకులు ఆవులరెడ్డి, ఆదినారాయణ, గోపాల్ తదితరులు ఉన్నారు.

● ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గల రోగులకు మంగళవారం శ్రీశైలం నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ మోమిన్ షబాన పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. అలాగే ఆమె రక్తదానం కూడా చేశారు.

యునాని వైద్యశాలలో మందుల కొరత

● ఇబ్బందులు పడుతున్న రోగులు



ప్రభుత్వ యునాని వైద్యశాల

కొత్తపల్లి, సెప్టెంబరు 17: యునాని వైద్యానికి గడ్డు కాలం మొదలైంది. ఏడాదికిపైగా యునాని వైద్యశాలకు మందులు సరఫరా కావడం లేదు. దీంతో ఉన్న వైద్యాధికారి, సిబ్బంది ఆసుపత్రికి వచ్చే రోగులకు ఉచిత సలహాలు ఇవ్వడం ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలోనే మారుమూల మండలమైన కొత్తపల్లికి సుమారు 25ఏళ్ల క్రితమే యునాని వైద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓ మూల గదిలో యునాని వైద్యశాలను ఏర్పాటు చేశారు. ఈ వైద్యశాలకు ఓ వైద్యాధికారి, ఓ అటెండరును సైతం నియమించారు. ఏడాదికిపైగా వైద్యశాలకు మందుల సరఫరా కావడం లేదు. వైద్యాధికారి, అటెండర్లు విధులకు హాజరవుతున్నారు గానీ.. ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. యునాని వైద్యశాలను కూడా ఒక చిన్నపాటి గదిలో ఏర్పాటు చేయడం వల్ల ఇద్దరు రోగులు వచ్చినా కూర్చునే పరిస్థితి లేదు. ఈ వైద్యశాలకు వచ్చిన సామగ్రి కూడా స్థానిక పీహెచ్‌సీలోనే వినియోగించుకుంటున్నట్లు తెలుస్తుంది. వైద్యశాలలో కేవలం 15 నుంచి 25 వరకు చిన్న చిన్న మందుల డబ్బాలు మినహాయిస్తే.. ఎలాంటి మందులు లేవు. ఇప్పటికైనా ప్రభుత్వం సాంప్రదా వైద్యమైన యునానికి ప్రజల్లో అదరణ తగ్గకముందే యునాని మందులు సఫరా చేయాలని రోగులు కోరుతున్నారు. ఈ విషయంపై కడప ఆయూష్ రీజనల్ డైరెక్టర్ శేఖర్‌రాజును ఆంధ్రజ్యోతి ఫోన్‌లో సంప్రదించగా.. జిల్లాలోని చాలా వైద్యశాలలో మందుల కొరత ఉందని, అక్కడి వైద్యులు కూడా ఇండెంట్ పంపిణీ చేయాలని చెప్పారు. ఈ నెలాఖరులోగా అన్ని రకాల మందులు సరఫరా చేస్తామన్నారు.

ప్లాస్టిక్ రహిత నల్లమలగా మార్చుదాం

రుద్రవరం, సెప్టెంబరు 17: నల్లమలను ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా చేద్దామని రేంజర్ శ్రీపతినాయుడు అన్నారు. మంగళవారం నేషనల్ టైగర్ కన్సర్వేషన్ అథారిటీ ఆదేశాల మేరకు మొక్కలు నాటారు. రుద్రవరం రేంజ్‌లోని శీతల బేస్ క్యాంపు, సాంబారు బేస్ క్యాంపు, తైసింగవరం బేస్ క్యాంప్, పాల్కన్ బేస్ క్యాంపులలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లమలలో ఎక్కడా కూడా ప్లాస్టిక్ వాడరాదని సూచించారు. వంద శాతం ప్లాస్టిక్ రహిత పర్యావరణం సాధించాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసరు ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసర్లు ముక్తర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, బీట్ ఆఫీసర్లు నాగేంద్రయ్య, సురేంద్రగౌడ్, రామకృష్ణ, నరసింహారెడ్డి, నాగహుసేనయ్య, జేమ్స్ పాల్ పాల్గొన్నారు.


రుద్రవరం రేంజ్‌లో మొక్క నాటి నీరు పోస్తున్న రేంజ్ ఆఫీసరు శ్రీపతినాయుడు

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

చాగలమర్రి: మొక్కల సంరక్షణ అందరి బాధ్యతని ఉపాధి హామీ పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రధాని మోదీ ఇచ్చిన ఏక్ పెడ్ మా కే నామ్ పిలుపు మేరకు మొక్కను నాటారు. కార్యక్రమంలో ఏపీవో నిర్మల, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రషీద్‌బాష, వెంకటసుబ్బయ్య, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కోట్ల జన్మదిన వేడుకలు

డోన్, సెప్టెంబరు 17: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించేలా టీడీపీ నాయకులు ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. అదేవిధంగా అన్నదాన కార్యక్రమంతో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు బీజేపీ, జనసేన కూటమి నాయకులు జన్మదిన వేడుకల్లో రక్తదానం చేసేలా ఏర్పాట్లు చేసినట్లు టీడీపీ నాయకులు తెలిపారు.

కాణిపాకంలో ఎమ్మెల్యే కోట్ల దంపతులు

డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ఆయన సతీమణి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ దంపతులు మంగళవారం కాణిపాకం వరసిద్ధి వినాయకున్ని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే కోట్ల దంపతులను సన్మానించి వరసిద్ధి వినాయకుని జ్ఞాపికను అందజేశారు.


కాణిపాకంలో ఎమ్మెల్యే కోట్ల దంపతులను వినాయకుడి జ్ఞాపికతో సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

ఇద్దరు మట్కా బీటర్ల అరెస్టు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 17 : మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఇరువురు మట్కా బీటర్లను అరెస్ట్ చేసి, రూ.6710 నగదు స్వాధీనం చేసుకున్నట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు మంగళవారం వెల్లడించారు. గ్రామానికి చెందిన ఇద్దరు మట్కా రాస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు చేయగా నగదుతో పాటు, మట్కా చీటీలు లభ్యమయ్యాయని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అలాగే కొలిమిగుండ్లలో మేడ గంగయ్య అనే వ్యక్తి నుంచి 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు మంగళవారం తెలిపారు.

రెడ్డిపల్లిలో ఎనిమిదిమంది జూదరులు...

సంజామల: రెడ్డిపల్లెలో పేకాట ఆడుతున్న పేరుసోములకు చెందిన ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ రామకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. రెడ్డిపల్లె సమీపంలోని కొండల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించి వీరి వద్ద నుంచి రూ.17,640 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ వివరించారు.

ఘనంగా మోదీ జన్మదినం

డోన్(రూరల్), సెప్టెంబరు 17: పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని పాతబస్టాండులో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రధాని జన్మదిన కేకును డీఎస్పీ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, పట్టణ, రూరల్ సీఐలు ఇంతియాజ్ బాషా, సీఎం రాకేష్, పట్టణ, రూరల్ ఎస్ఐలు శరత్ కుమార్ రెడ్డి, మమత, ఆర్టీవో క్రాంతి కుమార్ పాల్గొన్నారు. అలాగే బీజేపీ కోఆర్డినేటర్ వడ్డె మహారాజ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు: డీఎస్పీ

అవుకు, సెప్టెంబరు 17 : శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం రాత్రి డీఎస్పీ అవుకు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం బనగానపల్లె సీఐ మంజునాథరెడ్డి, అవుకు ఎస్ఐ రాజారెడ్డితో కలిసి రామాపురం గ్రామానికి చేరుకొని సాయి బాబా అలయం ఆవరణలో ప్రజలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గ్రామాల్లో సారా, మట్కా, పేకాటను సమూలంగా నిర్మూలించటమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకవస్తే పరిష్కరించే విధంగా కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు పేరుసోముల విద్యార్థిని ఎంపిక

సంజామల, సెప్టెంబరు 17: జాతీయస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని దివ్యశ్రీ ఎంపికైనట్లు హెచ్ఎం సీతారావమ్మ మంగళవారం తెలిపారు. మంగళవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థిని దివ్యశ్రీ ఈ నెల 25 నుంచి హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి సబ్ జూనియర్ బాల్ బాడ్మింటన్ క్రీడల్లో పాల్గొంటుందన్నారు. క్రీడల్లో రాణించేందుకు కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్‌ను ఆమె అభినందించారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి


ఆళ్లగడ్డలో స్వామి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విశ్వబ్రాహ్మణులు

కోవెలకుంట్ల/ఆళ్లగడ్డ/అవుకు/కొలిమిగుండ్ల, సెప్టెంబరు 17: విశ్వకర్మ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కోవెలకుంట్ల పట్టణంలోని బనగానపల్లె సర్కిల్‌లో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో, ఆళ్లగడ్డ పట్టణంలోని విశ్వరూప కాలనీలో వెలసిన కాళీకాత ఆలయంలో, అవుకు పట్టణంలో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో, కొలిమిగుండ్లలో స్వామిజీ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో స్థానికులు పాల్గొన్నారు.

బీసీ రాజారెడ్డికి సన్మానం

బనగానపలె, సెప్టెంబరు 17 : గణేశ్ ఉత్సవాలకు సహకరించిన ఉమ్మడి కర్నూలు జిల్లా టెలికం అడ్వైజర్ మాజీ సభ్యుడు, బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ రాజారెడ్డిని పట్టణ ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, మల్లారెడ్డి, నాగేంద్రరెడ్డి, టీచర్ నాగరాజు, భాస్కరరెడ్డి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 17: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ వెంకటరామిరెడ్డి సూచించారు. ఆళ్లగడ్డ పట్టణంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ కార్యాలయం నుంచి పాత బస్టాండు వరకు మంగళవారం ర్యాలీ, మానవహారంగా నిర్మించారు.

చాగలమర్రి: పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత మన అందరి బాధ్యతని జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్‌హుసేన్ తెలిపారు. మంగళవారం చాగలమర్రిలో స్వచ్ఛతా హి సేవా ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తులశమ్మ, నంద్యాల డీఎల్పీవో రాంబాబు, ఎంపీడీవో మహబూబ్‌దౌల, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, సూపర్‌వైజర్లు రామలింగారెడ్డి, సుశీల, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నులి పురుగులతో రక్తహీనత

శిరివెళ్ల, సెప్టెంబరు 17 : చిన్నారుల్లో నులిపురుగులతో రక్తహీనత ఏర్పడుతుందని డీఆర్‌డీఏ పీడీ రామచంద్రారెడ్డి, డీఈవో సుధాకర్‌రెడ్డి అన్నారు. గోవిందపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఎంపీడీవో సుబ్రమణ్యం, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, ఎంఈవోలు శంకర్‌ప్రసాద్, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఓజోన్ పరిరక్షణ అందరి బాధ్యత

చాగలమర్రి, సెప్టెంబరు 17: ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యతని జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం చాగలమర్రి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఓజోన్ పొర పరిరక్షణ వారోత్సవాలను హెచ్ఎం కోటయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓజోన్ పొర పరిరక్షణ అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు మెమొంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, జిల్లా సైన్స్ అధికారి సుందర్‌రావు, జిల్లా ఎన్‌జీసీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా దీక్షా కోఆర్డినేటర్ నాగేంద్రకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

డోన్(రూరల్), సెప్టెంబరు 17: అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు చేస్తూ పలువురి నుంచి ద్రోణాచలం సేవా సమితి సభ్యులు మన్ననలు పొందుతున్నారు. మంగళవారం పట్టణ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతంలో మృతి చెందిన యాచక అనాథ శవానికి హిందూ సాంప్రదాయ పద్ధతిలో శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ద్రోణాచలం సేవా సమితి ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు వంద మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించినట్లు ఆ సమితి అధ్యక్షులు షాదీఖానా రాజ తెలిపారు. కార్యక్రమంలో ద్రోణాచలం సేవా సమితి గౌరవాధ్యక్షుడు సాధిక్, రోటరీ క్లబ్ సభ్యులు రాజయ్యగౌడు, గురుస్వామి, తాహేర్ బాషా, పానీపూరి మురళి, దాదా హుశేన్, డోన్ పోలీసులు సునీల్, రాము పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

కోవెలకుంట్ల, సెప్టెంబరు 17 : రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. మంగళవారం కోవెలకుంట్ల పట్టణంలోని ఎరువుల దుకాణం తనిఖీ చేసి ఎరువుల శాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా స్టాకు రిజిస్టరు, బిల్‌బుక్కులు, ఎరువుల నిల్వలు పరిశీలించారు. అలాగే రైతు సేవా కేంద్రంలో యూరియా అందుబాటులో ఉంచామన్నారు. యూరియా రావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి కొనుగోలు చేయాలన్నారు.

రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 17: ఆళ్లగడ్డ పట్టణంలోని అనంత డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి మంగళవారం చెప్పారు. ఆళ్లగడ్డ పట్టణంలో నిర్వహించిన ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచటంతో ఎంపిక చేశారన్నారు. కళాశాలలో విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్‌పర్సన్ విజయలక్ష్మి, పీఈటీ వెంకటరమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 17: విద్యలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంఈవో ప్రతాప్‌రెడ్డి సూచించారు. మంగళవారం మాయలూరు ఉన్నత పాఠశాలలో ఆయా గ్రామాల ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలను బట్టి వారిని అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండీ షరీఫ్ ఉన్నారు.

ఉద్యాన పంటలకు ప్రభుత్వ రాయితీ

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 17 : ఉద్యాన పంటలు సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీ అందిస్తోందని ఉద్యానవన శాఖ కోవెలకుంట్ల సబ్ డివిజన్ అధికారి ధరణి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ రైతులు సాగు చేసే జామ, దానిమ్మ, మామిడి, డ్రాగన్ ఫ్రూట్స్ పంటలకు 40శాతం సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు. పూలతోటల సాగుకు సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు. పాంఫండ్స్, పాలీహౌస్‌లు, కోల్డ్ స్టోరేజీలకు 50 శాతం సబ్సిడీ అందిస్తున్నట్లు హెచ్‌వో ధరణి తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

చాగలమర్రి, సెప్టెంబరు 17: సచివాలయ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేక అధికారి జాకీర్‌హుసేన్ హెచ్చరించారు. మంగళవారం చాగలమర్రి-2 సచివాలయాన్ని డీఎల్పీవో రాంబాబుతో కలిసి తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. సమయ పాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్‌దౌల, ఇన్‌చార్జి ఈవో తాహిర్‌హుసేన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మండల స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

చాగలమర్రి, సెప్టెంబరు 17: చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 19న మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో అనూరాధ, పీడీ దాదాపీర్ మంగళవారం తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొనాలని కోరారు.

జిల్లా స్థాయి క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

అవుకు. సెప్టెంబరు 17 : అవుకు పట్టణంలోని మదర్‌మోడల్ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగిన సబ్ జూనియర్ బాక్సింగ్ చాంపియన్ షిప్ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంట్ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ ఈ నెల 15న నంద్యాలలో నిర్వహించిన క్రీడల పోటీల్లో పాఠశాలకు చెందిన 27 మంది బాలురు, 29మంది బాలికలు పాల్గొని రెండు విభాగాల్లో ఓవరాల్ చాంపియన్ షిప్‌ను సాధించారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కోచ్ మాస్టర్ చంద్ర మోహన్‌గౌడ్, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రామసుబ్బమ్మ, ప్రిన్సిపాల్ సాయిక్రిష్ణవేణి, ప్రధానోపాధ్యాయుడు మురళీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

25న చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్టు

డోన్(రూరల్), సెప్టెంబరు 17: చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్టును ఈనెల 25న నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణి క్యంశెట్టి తెలిపారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి రామనర్సప్ప, పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు షైరున్నిస్సా వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు టాలెంట్ టెస్టులో పాల్గొని జయప్రదం చేయాలని మాణిక్యం శెట్టి కోరారు.











